అంగన్‌వాడీల్లో అవస్థలు పట్టవా?



ఉప్పునుంతల బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరి వినియోగంలో లేని అంగన్‌వాడీ కేంద్ర భవనం

- మరమ్మతుల్లేక శిథిలావస్థలో భవనాలు
- మౌలిక వసతుల్లేక గర్భిణులు, బాలింతల ఇబ్బందులు
- పట్టింపులేని పాలకులు, అధికారులు

ఉప్పునుంతల: స్త్రీ, శిశు సంక్షేమంపై క్షేత్రస్థాయిలో ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ పెట్టడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారం విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఇబ్బందుల మధ్య కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాలకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన భవనాలు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరాయి. వాటిలో కనీస మౌలిక వసతులు లేక కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. మండలంలో 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 23 అంగన్‌వాడీలకు సొంత భవనాలు ఉండగా, జయరాంతండా, వెల్టూరులో రెండు కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మరో 31 కేంద్రాలకు ఉచితంగా సమకూర్చిన భవనాల్లో కొనసాగుతున్నాయి. పాఠశాల ప్రహరీలో ఉన్న భవనాల్లో, పాఠశాలల్లో ఆయా కేంద్రాలను కొనసాగిస్తున్నారు. మండలంలో 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా, 36 కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉప్పునుంతల మండల కేంద్రంతో పాటు మండలంలోని దేవదారికుంట తండా, కాంసానిపల్లి తండా, మామిళ్లపల్లి, కాంసానిపల్లి తదితర దాదాపు అన్ని గ్రామాల్లో ఇరువై ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉప్పునుంతల మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న ఏఓ క్వార్టర్‌లో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో 834 మంది ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సులోపు పిల్లలు ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్ల వయస్సులోపు పిల్లలు 908 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 318 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. పాలతోపాటు గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు కేంద్రాల్లోనే ఒక పూట భోజనం అందిస్తున్నారు. మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, బాత్‌రూంల వసతిలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు రావడానికి గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపడంలేదు. దాంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కరెంట్ వసతి లేక ఎండాకాలంలో ఉక్కబోతతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఉప్పునుంతల ఎస్సీ కాలనీలో ఇరుకుగా ఉన్న గదిలో వంట చేస్తున్న అంగన్‌వాడీ ఆయా(ఫైల్)

కొత్త భవనాల కోసం ప్రతిపాదనలు..

శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాల స్థానంలో కొత్తవాటి కోసం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణంతో పాటు తాగునీరు, తదితర వసతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. కొన్ని గ్రామాల్లో భవనాలు పూర్తిగా శిథిలావ్థకు చేరాయి. కేంద్రాలకు ఇప్పటివరకు కరెంట్ వసతిలేదు. పాత భవనాల పరిస్థితులను, కరెంట్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడం జరిగింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్ర వద్ద స్థలం ఉండి ప్రహరీ ఉన్న చోట కిచెన్ గార్డెన్లు పెట్టడానికి 24 సెంటర్లకు డబ్బులు మంజూరయ్యాయి. ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సున్నం లేదా కలర్ వేయించి శుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తాం.

– దమయంతి, ఐసీడీఎస్ సీడీపీఓ, బల్మూర్ ప్రాజెక్టు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అచ్చంపేటలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి పట్టణంలో శ్రీకృష్ణాజన్మాష్టమి సందర్భంగా వేంకటేశ్వరస్వామిని కృష్ణుడి రూపంలో అలంకరించారు. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో ప్రజలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యాదవులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
కల్వకుర్తిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చైర్మన్ కల్వ మనోహర్ ఏర్పాట్లు చేశారు.

❖ చారకొండ మండలంలో సిర్సనగండ్ల సీతారామ చంద్రాస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

❖ అచ్చంపేట పట్టణంలోని గోకుల్‌నగర్, పాత బజార్‌లో విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

❖ లింగాల కోదండరామాలయంలో ప్రధాన అర్చకులు రామాచారి వేదమంత్రోచ్ఛరణ మధ్య డోలారోహణం నిర్వహించారు. అంబట్‌పల్లి, కోమటికుంటలో డోలారోహణం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

❖ పెంట్లవెల్లి మండలంలోని గోప్లాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో కోలాటాలు, ఆటపాటలతో ఊరేగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. మంచాలకట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

❖ మన్ననూర్ పాత బజార్ కాలనీలో కృష్ణుడు, గోపికల వేషధారణలతో బాల బాలికలు ఆకట్టుకున్నారు. చిన్ని కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు.

❖ కొల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి చిత్రపటాలు, విగ్రహాలు ఊరేగింపు చేశారు. కొల్లాపూర్‌లో యాదవ కులస్థులు శ్రీకృష్ణనగర్ కాలనీలో గల కృష్ణమందిరంలో, కోర్టు సమీపంలోని భగవద్గీతా మందిరంలో, వరిదేల మాధవస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. మాదవస్వామి గుడి వద్ద వరిదేల యాదవ సంఘం నాయకులు ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



కొల్లాపూర్‌లోఉట్టి కొడుతున్న యాదవులు



గోప్లాపూర్‌లో కోలాటం వేస్తున్న బాలికలు

❖ ఉప్పునుంతలలో కేదారేశ్వరాలయం, మామిళ్లపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వెల్టూరు వేంకటేశ్వరస్వామి ఆలయం, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

❖ కోడేరు, తుర్కదిన్నె గ్రామాల్లో శ్రీ కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి మహుమతులు ప్రదానం చేశారు.

❖ తాడూరు మండల కేంద్రం, గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులను వివిధ వేషధారణతో ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి



కల్వకుర్తి రూరల్: మండలంలోని వేపూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్యామ్ సుందర్ రావు బాత్రూంలో జారిపడడంతో హైదరాబాద్ కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడిని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

యూరియా కోసం రైతుల ఇబ్బందులు



తెలకపల్లి: మండలంలో రైతులు యూరియా కోసం రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంట పొలాలకు ఎరువులు వేసుకోవడానికి సిద్ధమయ్యారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎక్కడా దొరకకపోవడంతో సింగిల్ విండో కార్యాలయంలో అందుబాటులో ఉందని, శనివారం సింగిల్ విండో కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాల రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఒకో రైతుకు రెండు యూరియా బ్యాగులు ఇస్తున్నారు తప్ప పంటపొలాలకు సరిపోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భీమ సముద్రంపై ఆందోళన లేదు



బిజినేపల్లి: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వర్షాలు నిలకడగా కురుస్తున్నాయని, మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన భీమ సముద్రం చెరువు వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటి పారుదలశాఖ ఏఈ రమేష్ తెలిపారు. శనివారం భీమ సముద్రం చెరువు అలుగు పారుతుండటంతో చెరువులో అలలు తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజలు ఆందోళన చెంది అధికారులకు సమాచారం అందించారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ చెరువు కట్టపైకి చేరుకుని పరిశీలించారు. మండల వ్యాప్తంగా వర్షాలు సమతుల్యంగా కురుస్తుండటంతో పైనుంచి వరద పెరిగి చెరువుకు ఇబ్బంది కలిగే పరిస్థితి లేదని, అలుగు పారుతుండటంతో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కదారి వెంకటయ్య, శెట్టి రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, మ్యాతరి సత్యం, తదితరులు ఉన్నారు.

నాయినోనిపల్లికి ప్రత్యేక బస్సులు

లింగాల: ప్రతి ఆదివారం నాయినోనిపల్లి మైసమ్మ దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు అచ్చంపేట డిపో మేనేజర్ మురళీ దుర్గా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30, 10.00, 1.30, 5.00 గంటలకు బస్సులు బయలుదేరుతున్నట్లు డీఎం తెలిపారు. ఈ సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెద్దకొత్తపల్లి: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాలీబాల్ పోటీలకు కల్వకోలు ఉన్నత పాఠశాలకు చెందిన కె.సందీప్ ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉమాదేవి తెలిపారు. ఈనెల 18, 19 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో వాలీబాల్ అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. సందీప్‌ను పీడీ ప్రతాప్‌సింగ్ అభినందించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

తాడూరు: మండల కేంద్రం పోల్మురుకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా ఉందని, పొలాలకు రైతులు వెళ్లడానికి తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి మరమ్మతు చేపట్టాలని కోరారు. పోల్మురు-గుట్టలపల్లి మధ్య రోడ్డు కంకర తేలి ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్‌దారుల గ్రామ కమిటీ

లింగాల: మండలంలోని శాయిన్‌పేటలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వివిధ రకాల పింఛన్‌దారుల గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతులు, ఒంటరి మహిళలతో కూడిన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. అదే విధంగా ఈ నెల 26న అచ్చంపేటలో జరిగే ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం స్థాయి సన్నాహక సమావేశం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధాల సంఘాల జిల్లా ఇన్‌చార్జి పానుగంటి సిద్దు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కల్వకుర్తి రూరల్: పట్టణంలో పలు కాలనీలలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తిలక్ నగర్, విద్యానగర్, హైదరాబాద్ రోడ్డు, బచ్పన్ పాఠశాల, కల్యాణ్ నగర్ 1,2 ఏరియా తిమ్మనపల్లి రోడ్డు, ఆంధ్ర బ్యాంక్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపేస్తున్నట్లు తెలిపారు. వాసవీనగర్, ఎల్లికల్ రోడ్డు, గాంధీనగర్, మార్కెట్ రోడ్డు, కూరగాయల మార్కెట్, అశోక థియేటర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

కల్వకుర్తి రూరల్: జిల్లాలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేష్ దారమోని చెప్పారు. శనివారం కల్వకుర్తిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలతోపాటు బీసీ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సంస్థ తమదన్నారు. కృష్ణ, శేఖర్, సాదిక్, జంజీర్, రమేష్ ఉనాన్నారు.

చర్లతిర్మలాపూర్ గ్రామానికి బ్రిడ్జి నిర్మించాలి



తాడూరు: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తాడూరు మండలంలోని చర్ల తిర్మలాపూర్ గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో చెరువు బ్యాక్ వాటర్ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడు తూ తిర్మలాపూర్ గ్రామం జలదిగ్బంధంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి రా కపోకలు ఆగిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామంలో పేదలందరికి ప్రభుత్వం మెడికల్ క్యాంపులు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాశన్న, స్వామి, కుర్మయ్య, చిన్నయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో 'పాట' ఆగదు

తెలకపల్లి: అక్రమంగా కళాకారులను అరెస్టు చేస్తే పాట ఆగదని సమతా సైనిక్ దళ్ సైనికుడు శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజా కళాకారుడు గోరటి రమేష్ పాట ప్రచారం అవుతోంది. నిరంతరం ప్రజల కోసమే పాటలు రాసి పాడుతూ ప్రజలను చైతన్యం చేస్తున్న ప్రజాకవి, రచయిత గోరటి రమేష్ ఈ మధ్యకాలంలో సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో మర్వాడీలు దళితుడిపై దాడి చేస్తే అతనికి మద్దతుగా కొందరు వెళ్లగా వారిపై విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. దాని దృష్టిలో పెట్టుకుని తన గళాన్ని వినిపిస్తూ మర్వాడీలపై 34 సెకన్ల పాట పాడారన్నారు. ఇది భారీ ఎత్తున ప్రచారం కావడంతో ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి విచారించడం సరైంది కాదన్నారు. అరెస్టులు చేస్తే పాట ఆగదని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శేఖర్ మాస్టర్ కోరారు.

తిర్మలాపూర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాడూరు: మండలంలోని తిర్మలాపూర్ నుంచి ఉయ్యాలవాడ మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై కేసరి సముద్రం దాటేందుకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిని శనివారం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరిశీలించారు. ఆరు రోజులుగా కురుస్తున వర్షాల వల్ల గ్రామం నలుమూలల జలదిగ్బంధంలో కురుకుపోయింది. గ్రామానికి రాకపోకలు నిలిచాయి. ప్రతి రోజు కురగాయలు, పాలు జిల్లా కేంద్రానికి తీసుకెళ్లే రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ఎత్తు పెంచకపోవడంతో సమస్యలు తలెత్తాయని గ్రామస్తులు వివరించారు. వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి బ్రిడ్జిని ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వెంకటస్వామి, సోమయ్య, రాములు, వెంకటేష్, రఘు తదితరులు ఉన్నారు.

ఘనంగా వాజ్‌పేయ్ వర్ధంతి



బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో దివంగత భారత మాజీ ప్రధాని అటల్ బిహరి వాజ్‌పేయ్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రగౌడ్ మాట్లాడారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారుల అనుసంధానం ఉండాలని నేషనల్ హైవేలను నిర్మించారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు రోడ్లు అనుసంధానం కోసం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ సెక్రటరీ చందు, టౌన్ ప్రధాన కార్యదర్శులు బొట్టు శీను, జగదీశ్వర్ రెడ్డి, రాము, సుధాకర్, సైదులు, చారి, బాలస్వామి, లక్ష్మారెడ్డి, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతాం



మాట్లాడుతున్న కిరణ్

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాటం చేపడతామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ వెల్లడించారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు విద్యావిధానాన్ని పూర్తిగా కాషాయికరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా విద్యావిధానాన్ని మారుస్తోందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకుండా పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 25, 26 తేదీలలో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాలకు విద్యార్థి సంఘం నాయకులు హాజరు కావాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, నాయకులు కార్తీక్, శివ, తదితరులున్నారు.

అర్హులందరికీ స్థలాలు ఇవ్వాలి



స్థలాలు పరిశీలిస్తున్న ఆంజనేయులు, తదితరులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో రెండు సర్వే నంబర్లలో అర్హులకు కేటాయించిన ఇంటి స్థలాలను వెంటనే వారికి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల క్రితం ఎనిమిది ఎకరాలు ఒకచోట 165 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని, మరో చోట 41 మందికి స్థలాలు ఇచ్చినా ఇప్పటి వరకు వారికి స్థలాలు అప్పగించలేదన్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా ఇల్లు కట్టుకోలేకపోతున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగన్, పరమేశ్వర్, రామస్వామి, విజయ్, శివ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగింపుపై హర్షం

చారకొండ: రాష్ట్రంలో పీఏసీఎస్ సొసైటీల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు గడువు పెంచడంతో చారకొండ పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గుర్వయ్య గౌడ్ మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుర్వయ్యగౌడ్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 904 సహకార సంఘాల కాలపరిమితి, 9 డీసీసీబీ చైర్మన్ల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన అశ్వినికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.25వేల చెక్కును బాధిత కుటుంబానికి శనివారం నాయకులు కొండల్ యాదవ్ అందజేశారు. అశ్విని అనారోగ్యానికి గురికావడంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి రూ.25 వేలు మంజూరైనట్లు వివరించారు. అనంతరం బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొండల్, చిన్న సైదయ్య,కొండల్, మార్కండేయుడు, శోభన్‌చారి, తిరుపతయ్య, శేఖర్, కుమార్ , భరత్ తదితరులు ఉన్నారు.

చిరుతదాడి నుంచి తప్పించుకున్న ఆవు



దోమలపెంట: బ్రహ్మగిరి గ్రామంలో యార్డు ఎదురుగా ఉన్న రేణుక ఎల్లమ్మ గుడి దగ్గర శనివారం మేతమేస్తున్న ఆవుపై చిరుత దాడి చేసింది. చిరుత దాడిని ముందుగా పసిగట్టిన ఆవు చాకచక్యంగా తప్పించుకుంది. గతంలో చిరుత పందులను, కుక్కలను వేటాడేది. ఇప్పుడు ఆవులపై దాడి చేస్తోంది. దీంతో ప్రస్తుతం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో సంచరిస్తున్న చిరుతను అటవీశాఖ వారు బోన్లు బందించి అడవి మధ్య లో విడిచిపెట్టాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

ముస్లిం యువకుల మానవత్వం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల చౌరస్తా సమీపంలో నేపాల్‌కు చెందిన బాలుడు ఆడుకుంటూ మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. బాలుడి తల్లిదండ్రులు పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. పేదరికంతో వైద్యం చేయించలేని పరిస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న ముస్లిం యువకుడు సాధిక్ తన మిత్రులకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు. రూ.21వేలు జమ చేసి శనివారం బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం యువకులు ఆశు, అమీర్, మల్లేష్, సోహిద్, అర్షద్ ఉన్నారు.

అనాథ యువతి పెళ్లికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన నిరుపేద మహేశ్వరి వివాహం కోసం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.5వేలు, మరి కొందరు బియ్యం అందించారు.

బాధిత కుటుంబాలకు..

తిమ్మాజిపేట: మండలంలోని మారేపల్లిలో ఇద్దరు వ్యక్తులు హఠాత్తుగా మృతి చెందడంతో వారి కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన అన్నమ్మ, మనోహర్ దంపతులు రూ.10 వేల సాయం చేశారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి



కొల్లాపూర్: స్వాతంత్ర్య దినోత్సవం రోజు అచ్చంపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులను అవమానపర్చే విధంగా మాట్లాడిన అధికారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కొల్లాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీయూటీయు జిల్లా సహాయ కార్యదర్శి శివవర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం అనంతరం అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లిన పారిశుద్ధ్య కార్మికులను 'మీరొస్తే వాసన వస్తోంది' అంటూ అవమానకరంగా మాట్లాడిన అధికారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, చిరంజీవి, కురుమయ్య, రామస్వామి, మున్నయ్య, వెంకటస్వామి, బాలస్వామి, సుజాత, పద్మ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృత్యువాత

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గేదె మృత్యువాత పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గేదెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఆర్టీసీ డీఎం యాదయ్యను వివరణను కోరగా గేదె యజమాని వివరాలు తెలుసుకుని న్యాయం చేస్తామని తెలిపారు.

బైక్ అదుపు తప్పి చిన్నారులకు గాయాలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయిరాం థియేటర్ సమీపంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పునుంతల మండలం దేవదారికుంటకు చెందిన భాస్కర్ బైక్‌పై స్కంధతో పాటు మరో ఇద్దరు చిన్నారులను సాయినగర్ వైపు తీసుకెళ్తున్నాడు. ఒక్కసారిగా రోడ్డు మీదకు కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. ముఖం, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో కొంతమంది కుట్రపూరితంగా వ్యవహరిస్తూ మార్వాడీ గో బ్యాక్ పేరుతో హిందూ సమాజంలో విభజన చేసే కుట్రలు చేస్తున్నారని హిందూ వేదిక నాయకుడు పరుశురాములు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎవరు ఎక్కడ వ్యాపారాలు చేసుకుంటే తప్పు ఏంటని ప్రశ్నించారు. హిందువుల కుల వృత్తులు దెబ్బతీసేలా ఒక వర్గం షాపులు నడిపిస్తున్న వారిని ఏమీ అనకుండా మార్వాడీ గో బ్యాక్ అనడంలో కుట్ర ఉందన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ గో బ్యాక్ కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు.